ప్రజాశక్తి

మంగళవారం 16 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆ డిపిఆర్ మాకొద్దు !

◆ ఉపయోగం లేని పనులెందుకు ?
◆ తీవ్రమౌతున్న ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల పోరు
◆ ఫింగర్ జెట్టీలు, సౌకర్యాల కోసం పట్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
ఒక వైపు సముద్ర హోరు.. మరో వైపు మత్స్యకారుల పోరు - ఇదీ విశాఖ నగరంలోని చేపలరేవులో నెలకొన్న తాజా పరిస్థితి. కొద్దిరోజులుగా అక్కడి మత్స్యకారులంతా తమ గోడు వినాలంటూ అధికార యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి కోసమంటూ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తమకొద్దని, దాని వల్ల ఎటువంటి ఉపయోగమూ కలగదని వారు మండిపడుతున్నారు. హార్బర్‌లో సౌకర్యాలు కల్పించాలని, ఫింగర్ జెట్టీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హార్బర్‌తో ముడిపడిన జీవనం

ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చేపల వ్యాపారులు, సంప్రదాయ మత్స్యకారులు వేటకెళ్లొచ్చాక ఇక్కడ తమ ఉత్పత్తులను అమ్ముకోడానికి సరైన స్థలం ఉండాలంటూ తొలినుంచీ పోరాడుతూనే ఉన్నారు. విసిటిపిఎల్ విస్తరణ జరిగాక కొన్ని షెడ్లు వీరికోసం నిర్మించినా ఇంకా వందల సంఖ్యలో షెడ్లు అవసరం. అవిలేక వారంతా అవస్థలు పడుతున్నారు. కొత్తగా కొన్ని షెడ్లు వేయాలన్న డిమాండ్ వీరినుంచి వినిపిస్తోంది. గతంలో మేరీమాత గుడి దగ్గర బీచింగ్ పాయింట్ మత్స్యకారులకు ఉండేది. సుమారు 40 బోట్లు రిపేర్లు చేసుకునే ఈ ప్రదేశాన్ని వైజాగ్ పోర్టు కబ్జా చేసింది. దీనికి బదులుగా స్లిప్ వే కాంప్లెక్స్‌లో కొత్తగా బీచ్ పాయింట్, బోట్లును పైకి లాగేందుకు క్రేన్, 8 ట్రాలీలు.. రూ.152 కోట్ల డిపిఆర్‌లో మచ్చుకైనా లేవు. వీటిని చేర్చితేనే తమకు ప్రయోజనకరమని, లేకుంటే ఫిషింగ్ హార్బర్ నుంచి వందల కుటుంబాలు ఖాళీ చేసే దుస్థితి మిగతా 2లో..

మత్స్యకార సంఘాల ధర్నా

ధర్నా చేస్తున్న మత్స్యకారులు

విశాఖ కలెక్టరేట్ : కేంద్ర నిధులు రూ.152 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు కేవలం భవనాలు నిర్మించి అద్దెలు వసూలు చేసుకునే విధంగా ఉన్నాయని, ఇటువంటి అభివృద్ధి అవసరం లేదని మత్స్యకార సంఘాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద మత్స్యకారుల సంఘాలు ధర్నా నిర్వహించాయి. అనంతరం ధర్నాకు నాయకత్వం వహించిన ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, విశాఖ డాల్ఫిన్ బోటు ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, విశాఖ కోస్టల్ మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు మీడియాతో మాట్లాడుతూ హార్బర్‌లో ఫ్లోటింగ్ జెట్టీలు నిర్మించొద్దన్నారు. ప్రస్తుతమున్న జెట్టీల ఎత్తు పెంచాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరారు. కలిసి డ్రైవర్లు వేటాడి మిగతా 2లో..

అర్జీలు అందజేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి విశాఖ కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు

స్పందనకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : జిల్లాలో ప్రజల నుంచి వచ్చే స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో 138 విజ్ఞప్తులు అందాయి.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 83 వినతులు వచ్చాయి. నగర మేయర్ మిగతా 2లో..

లోకేష్ పాదయాత్రతో వైసిపి నేతల్లో గుబులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రోజు రోజుకూ ప్రజాధరణ పెరుగుతున్న లోకేష్ పాదయాత్రను చూసి వైసిపి నేతలకు గుబులు పట్టుకుందని టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర దిగ్విజయంగా వంద రోజులు పూర్తి చేసుకుందన్నారు. నాడు జగన్ పాదయాత్ర మార్నింగ్, మిగతా 2లో..

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై నేడు రాష్ట్ర సదస్సు

▶ వార్త 2లో..

ఉత్సాహంగా విసిసి సమ్మర్ క్యాంపులు

▶ వార్త 2లో..

రెజ్లర్లకు మద్దతుగా ప్రజా సంఘాల ధర్నా

▶ వార్త 2లో..

ముగిసిన టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్

టోర్నీలో ప్రతిభ కనబరిచిన వారితో నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ప్లే ఫిట్ టీం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ - 2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒడిశా స్టీవ్‌డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జెకె.నాయక్, ఎస్ఎంఎస్ డెంటల్ చైర్మన్ డాక్టర్ బి శ్రీధర్ హాజరై విజేతలకు షీల్డ్‌లు, మెమొంటోలతో పాటు రూ.4 లక్షల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డివిఎస్‌వై.శర్మ మాట్లాడుతూ ఈ పోటీలలో ఆరు రాష్ట్రాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఎస్ఎంఎస్ డెంటల్ 32 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా, ఒఎస్ఎల్ గ్రూప్ 31 పాయింట్లతో ద్వితీయ స్థానంలోనూ, విఎస్ఐఎల్ 29 పాయింట్లతో తృతీయ స్థానంలోనూ నిలిచాయని వెల్లడించారు. టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ కెవి.మురళీమోహన్ పాత్రో మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొన్న ఫ్రాంచైజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పని ప్రాంతంలో దెబ్బతగిలితే ప్రాథమిక చికిత్స చేసేందుకు మెడికల్ కిట్స్ కూడా అందుబాటులో ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమ్మర్ అలవెన్సు, మంచినీరు, తట్ట, గునపం, పార వంటి పనిముట్లుకు అలవెన్సులు ఇచ్చేవారని, నేడు వాటికి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని అన్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు కనీసం పరదాలు కూడా లేకపోవడం విచారకరమన్నారు. రెండు పూటలా పనిచేసినా కూలి గిట్టడంలేదన్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈ పథకాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తోందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో అన్యాయంగా రూ.20 వేల కోట్లను తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు, సౌకర్యాలు, మెరుగైన వేతనాలు సాధించేందుకు కూలీలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆ డిపిఆర్ మాకొద్దు !

ఏర్పడనుందన్న వాదనను మత్స్యకారులు వినిపిస్తున్నారు.

ఫింగర్ జెట్టీలే ప్రధాన డిమాండ్

గతం నుంచీ మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్‌లో ఫింగర్ జెట్టీలనే కోరుతున్నా లెక్కజేయకుండా పోర్టు ఫ్లోటింగ్ జెట్టీలకే మొగ్గుచూపడంతో వారు మండిపడుతున్నారు. 40 టన్నుల సామర్థ్యంగల వెస్సెల్స్ ఐస్, ఆయిల్ లోడింగ్ చేసుకునేటప్పుడు ఫింగర్ జెట్టీలైతేనే కాయగలవు. అందుకే ఈ జెట్టీల కోసమే మత్స్యకారులు పట్టుబడుతున్నారు. అలాగే జీరో నెంబరు జెట్టీ నుంచి 11వ నెంబరు జెట్టీ వరకూ గతంలో మునిగిపోయిన బోట్లను బయటకు తీసే బాధ్యతను పోర్టు యాజమాన్యం చేపట్టాలన్నది వీరి డిమాండ్‌గా ఉంది. డిపిఆర్‌లో ఈ అంశాలేవీ పొందుపరచనందున మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘాలు తాజాగా పోరుబాట పట్టాయి.

బిజెపి హంగామా దేనికి ?

ఇన్నాళ్లుగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలపై కన్నెత్తి చూడని బిజెపి నేతలు ఇదే తడవుగా ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావుతో కలిసి ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం పర్యటన చేసేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం. పోర్టుతో లాబీయింగ్ జరిపి పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న జివిఎల్ 'సోలో పెర్ఫార్మెన్స్'కు దిగడం చూస్తే సొంత లబ్ధికోసం తప్ప మరొకటి కాదని ఇట్టే అర్థమవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మత్స్యకార సంఘాల ధర్నా

తెచ్చిన ఎండు చేపలను అమ్ముకోవడానికి ఫ్లాట్‌ఫారాలు, షెడ్లు నిర్మించాలన్నారు. మహిళలకు చేపలు ఎండబెట్టుకోవడానికి స్థలాన్ని కేటాయించి ఫ్లాట్‌ఫారాలు నిర్మించాలన్నారు. నగరం నుంచి వస్తున్న మురుగునీటిని హార్బర్‌లో కలవకుండా చూడాలన్నారు. అండర్ వాటర్ బోట్లు రిపేర్లకు స్థలాన్ని కేటాయించి, మరమ్మతులకు అవకాశం కల్పించాలని కోరారు.

స్పందనకు వినతుల వెల్లువ

గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు. అలాగే డయల్ యువర్ సిపి కార్యక్రమానికి 17 ఫిర్యాదులు వచ్చాయి. సిపి త్రివిక్రమ వర్మ ఫిర్యాదుదారులతో మాట్లాడారు.

లోకేష్ పాదయాత్రతో వైసిపి నేతల్లో గుబులు

ఈవినింగ్ వాక్‌గా ఉండేదని విమర్శించారు. చిన్న కులాలను కూడా లోకేష్ కలుస్తున్నారని, అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. వైసిపి నాయకులు లోకేష్ పాదయాత్రను ముందు చిన్నచూపు చూసారని, పాదయాత్రకు రోజురోజుకూ జనాధరణ పెరుగుతుంటే వారిలో గుబులు పట్టుకుందని అన్నారు. చంద్రబాబు ఇంటిని ముట్టుకుంటే జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొడతామని హెచ్చరించారు.

రెజ్లర్లకు మద్దతుగా ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు, పిడిఎస్‌యు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, భారత బచావో కో-ఆర్డినేటర్ గూడూరు సీతామహాలక్ష్మి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి టి.అభి మాట్లాడారు. మహిళా రెజ్లర్లపై లైంగక వేధింపులకు పాల్పడ్డ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ విడుదల చేసినప్పటికీ ఇప్పటికీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్నటువంటి వారందరినీ నిరోధించాలంటే దేశవ్యాప్తంగా మహిళలు పని చేస్తున్న ప్రాంతాల్లో ఇంటర్నల్ కంప్లైంట్ సెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 104 వాహన ఉద్యోగులు (డ్రైవర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు)కు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.తాతబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఖాసిం, కోశాధికారి పి.ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ 104 వాహన సేవలను గతంలో వలే రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు 104 ఉద్యోగులను కాంట్రాక్టు, ఆప్కాస్‌లో నేరుగా అబ్జార్స్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జిఒ 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయిర్ కాంట్రిబ్యూషన్‌ను అరబిందో యాజమాన్యమే చెల్లించాలన్నారు.

జిఒ 38తో స్థానిక పత్రికలకు అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రెస్ అక్రిడిటేషన్ జిఒ 38తో స్థానిక పత్రికలకు అన్యాయం జరుగుతోందని, ఆ జిఒను సవరించి అక్రిడిటేషన్లు జారీ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎంఎ) ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ జిఒ వల్ల అనేకమంది జర్నలిస్టులు ప్రెస్ అక్రిడిటేషన్లు కోల్పోతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొత్త జీవోలో ఇన్ కం టాక్స్ రిటర్న్స్ జతచేయాలనే నిబంధనను తొలగించాలన్నారు.

ఉత్సాహంగా విసిసి సమ్మర్ క్యాంపులు

విసిసి సమ్మర్ క్యాంపులో సందడి చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొద్దిరోజులుగా జిల్లా వ్యాప్తంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపులు ఉత్సాహంగా సాగుతున్నాయి. పిల్లలకు ఇవి ఎంతో ఊరటనిస్తున్నాయి. తాత, అవ్వ చెప్పే కథలు, కల్పితాల నుంచి వచ్చే ఊహాశక్తిని పిల్లలలో పెంపొందించడం, ప్రకృతి, సమాజం పట్ల ఆసక్తి పెంచడం, స్నేహితులతో ఆటలు, ఇంటి పనిలో సహాయం అలవాటు చేయడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. 'వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు కావాలి, మరచిపోలేని జ్ఞాపకం కావాలి, సెలవులు తరువాత స్కూలు, కాలేజీకి సంతోషంగా వెళ్లాలి' అన్న మంచి ఆశయంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపులలో వందలాది మంది ఎక్కడికక్కడే పాల్గొంటున్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం తలిదండ్రులు, పాఠశాలలు మాత్రమే సరిపోవని, వారి కోసం అనేక వేదికలు, వ్యక్తులు, సంస్థలు పని చేయాలని, అందుకే విసిసి ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంపులు చేపడుతోందని నిర్వాహకులు తెలిపారు .తల్లిదండ్రుల సహాయ సహకారాలువుంటే మరింత మందిని ఈ క్యాంపులలో భాగస్వామ్యం చేయవచ్చునన్నారు. పాటలు పాడించడం, నేర్పడం, బొమ్మలు వేయించడం, నేర్పడం, చిన్న చిన్న ఏకపాత్రలు, మైమ్ మొదలైనవి, పాటలకు నృత్యం నేర్పడం. బొమ్మలు ఉన్న కథల పుస్తకాలను ఇచ్చి చదివించడం, చదివిన కథను చెప్పించడం, ఓరిగామి, చిన్న చిన్న ప్రయోగాలను చేయించడం, ఆకులు, పూలు, స్టాంపులు, కాయిన్స్ సేకరించే అలవాటు నేర్పడం, ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీస్, చిన్న చిన్న ఆటలు ఆడించడం, చదరంగం, చైనీస్ చెక్కర్ వంటివాటిలో అందరినీ భాగస్వామ్యం చేస్తూ సమిష్టితత్వం పెంచేవిధంగా నిర్వహించడం ఈ క్యాంపుల్లో ప్రత్యేకతని నిర్వాహకులు చెబుతున్నారు. ఏప్రిల్ 30న వర్క్ షాప్స్ నిర్వహించిన తరువాత నగరంలో 45 చోట్ల క్యాంపులు నడుస్తున్నాయని, మొత్తం 100 ప్రాంతాల్లో సమ్మర్ క్యాంపులు చేపడుతున్నామని వెల్లడించారు. వీటికి రోటరీ క్లబ్ (విశాఖపట్నం), ఆసరా చారిటబుల్ సొసైటీ, కొందరు వ్యక్తులు, స్థానిక ప్రజలు సహకారం అందిస్తున్నారన్నారు. నగరంలో భీమిలి, మధురవాడ, అరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచర పాలెం, గోపాలపట్నం, పెందుర్తి, మల్కాపురం, గాజువాక, స్టీల్, గంట్యాడ ప్రాంతాల్లో ఈ క్యాంపులు జరుగుతున్నట్టు తెలిపారు. వీటి నిర్వహణలో జోన్ కన్వీనర్లు కొండమ్మ, కుమారి, నాగరాణి, అరుణ ఎల్లాజీ, రజని, కృష్ణారావు, లీలావతి, లక్ష్మి, అప్పారావు, విసిసి ప్రెసిడెంట్ జి.అజయ్, సెక్రటరీ ఎస్.హరిత, డి.శైలజ, రోషన్, నిఖిల్, సాయి, శ్రావణి, డి.నీలవేణి, గణేష్, స్వాతి, సంధ్య, అప్పలరాజు, రాజేశ్వరి, జాహ్నవి, భరత్, రోహిణి, కృష్ణవేణి ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై నేడు రాష్ట్ర సదస్సు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని, ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ దుర్ఘటన మరవకుండానే స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, ఫార్మా ఇండస్ట్రీస్, రెడ్డి ల్యాబ్స్, విద్యుత్తు పరిశ్రమల్లో ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణపై మంగళవారం విశాఖ నగరంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనున్నట్టు తెలిపారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు, క్షతగాత్రుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్, లేబర్ డిపార్టుమెంట్ తనిఖీలు జరగడం లేదని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో 'పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ - ప్రభుత్వాల వైఖరి' అన్న అంశంపై సిఐటియు రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తలుగా పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జగదీష్ పటేల్ (గుజరాత్), సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరవుతారని తెలిపారు. కార్మికులు, బాధిత కుటుంబాలు, మేధావులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో -కన్వీనర్ కెఎం.కుమార్ మంగళం, సిఐటియు నాయకులు వి.కృష్ణారావు, కెవిపి.చంద్రమౌళి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ ప్రకటించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో తక్షణం నూతన జాబ్ కేలండర్‌ను ప్రకటించి ఉద్యోగ ఖాళీలు అన్నింటినీ భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో అన్ని విద్యార్థి, యువజన, నిరుద్యోగ పోరాట సంఘాలను కలుపుకొని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్ రెడ్డి 2 లక్షలా 35 వేల ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వైసిపి ప్రభుత్వం రాగానే తొలి ఏడాది జనవరి 1న జాబ్ కేలండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ చేపడతామని చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా రాష్ట్ర యువత భవిష్యత్తునే మరిచారని మండిపడ్డారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కో - కన్వీనర్ అచ్యుతరావు, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఆధ్వర్యాన యోగా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (వాల్తేరు) అధ్యక్షురాలు పారిజాత సత్పతి ఆధ్వర్యంలో వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో 12 నుండి 18 సంవత్సరాల వయస్సు గల యువత కోసం వారం రోజులపాటు నిర్వహిస్తున్న యోగా శిబిరం సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఇది ఈ నెల 22 వరకు కొనసాగనుంది.

సిలబస్‌లో మార్పులుపై 20న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న సిబిఎస్ఇ విద్యార్థుల సిలబస్‌లో అనేక మార్పులు చేసిందని అల్లూరి విజ్ఞాన కేంద్రం నిర్వహణ బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. సిలబస్ తగ్గింపు పేరుతో చరిత్రలో కీలకమైన ఘట్టాలకు సంబంధించిన పాఠ్యాంశాలు, సైన్స్‌లో డార్విన్ పరిణామవాదం వంటి అంశాలను తొలగించిందన్నారు. ఈ విధమైన చర్యలు శాస్త్రవేత్తలు, మేధావులు, అధ్యాపకులు, ప్రజాస్వామ్యవాదులలో చర్చనీయాంశంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ మార్పులలోని హేతుబద్ధతను, శాస్త్రీయతను చర్చించేందుకు 'సిలబస్‌లో మార్పులు - శాస్త్రీయత' అన్న అంశంపై అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం, జన విజ్ఞాన వేదిక, సైన్స్ టీచర్స్ ఫోరం, సోషల్ టీచర్స్ ఫోరంలు సంయుక్తంగా ఈ నెల 20న ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండే ఎండలు...

నిర్మానుష్యంగా రోడ్లు - ప్రజల అవస్థలు

ప్రజాశక్తి- తగరపువలస : ఎండలు మండిపోయాయి. నిత్యం జన సమ్మర్ధంతో ఉండే స్థానిక జంక్షన్, మెయిన్ రోడ్డు ఉదయం 11.30 గంటలకే కర్ఫ్యూను తలపించేలా నిర్మానుష్యంగా మారాయి. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ ఎండ వేడిమికి ఇబ్బంది పడ్డారు. వడ గాల్పులు వీచాయి. అయినప్పటికీ మార్కెట్‌కు ఆసుపత్రికి వెళ్లేవారు తలపై ఎండ పడకుండా టోపీలు, రుమాళ్లు వేసుకొని వెళ్లడం కనిపించింది. మహిళలు జాగ్రత్తలు పాటిస్తూ మార్కెట్‌కు రావడం కనిపించింది. ఎండల తీవ్రతకు తోడు ఉక్క పోత ఉండడంతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. మోకా తుపాను ప్రభావం వల్లనే ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. బంగాళాఖాతం నుంచి ఏపీకి వీచే గాలులను తుపాను లాగేసుకున్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో గాలిలో తేమ శాతం తగ్గిపోయింది. కేవలం తేమ లేని పొడిగాలులు వీస్తుండడంతో తీవ్రమైన ఉక్క పోత, ఎండ తీవ్రత ఉంది.

కరెంటు కోతలు

కారణాలు ఏమైనాగానీ అనధికార విద్యుత్ కోతలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఆదివారం ఏకంగా రెండు, మూడు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎప్పుడు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అసలే ఎండలకు, కరెంట్ కోత తోడవ్వడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సాకుతో ఇలా కరెంట్ కోతలు ఉండడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారు.

కర్ఫ్యూను తలపించేలా తగరపువలస మెయిన్ రోడ్డు

జ్యూట్ బ్యాగ్‌లు కుట్టే మిషన్లు అందజేస్తున్న ఆసరా సంస్థ ప్రతినిధులు

ఆసరా కుట్టు మిషన్లు వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహానికి ఆసరా స్వచ్ఛంద సంస్థ బాసటగా నిలబడింది. సుమారు రూ.50 వేలు విలువ చేసే జ్యూట్ బ్యాగ్‌లు తయారుచేసే రెండు కుట్టు మిషన్లను సోమవారం ప్రభుత్వ బాలుర గృహం పర్యవేక్షణాధికారి వీరయ్యకు అందించింది. ఈ సందర్భంగా ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, సభ్యులు రామారావు, డి.సూర్యనారాయణ, రాఘవరావు మాట్లాడుతూ, ఆసరా సంస్థ ఏర్పడి 11 ఏళ్ళు గడిచిందన్నారు. ముందు ముగ్గురుగా ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం 300 మంది సభ్యులుగా ఏర్పడి పేద విద్యార్థులకు, వైద్యం చేయించుకోలేని పేద రోగులకు సంస్థ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. పిఎం.పాలెంలో సంస్థ ఆధ్వర్యాన వృద్ధాశ్రమం నడుపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బాలుర గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య మాట్లాడుతూ, ఆసరా సంస్థ ద్వారా తమ విద్యార్థులకు అనేక సహాయ సహకారాలు అందాయని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు జనశిక్షణా సంస్థ ద్వారా జ్యూట్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణ తీసుకున్నారన్నారు. బాలురు తయారు చేసిన బ్యాగ్‌లను మార్కెటింగ్ చేసి వాటిపై వచ్చిన ఆదాయాన్ని బాలుర అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు.

భూములు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-పద్మనాభం. : తమ భూములు తమకు ఇప్పించాలని సోమవారం స్పందన కార్యక్రమంలో మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్నెడ్డి జగ్గారావు, కర్నెడ్డి వేణుగోపాలరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తమకు నర్సాపురం గ్రామంలోని 91.74 సర్వే నెంబర్‌లో 33 ఎకరాల భూమిలో మామిడి తోట వారసత్వంగా వచ్చిందని తెలిపారు. తమ భూమిని ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వం తీసుకుందని వివరించారు. ఈ నెల 8వ తేదీన జరిగిన గ్రామ సభల్లో తమకు ఎల్‌పిసిలు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్‌ను ప్రశ్నించగా ఆ భూమిని హోల్డ్‌లో పెట్టామని చెప్పారని వివరించారు. తమ భూములు జెడ్‌పిటిసి సుంకర గిరిబాబుకు సంబంధించిన బినామీల పేర్ల మీద నమోదయ్యాయని తెలిపారు. 2014లో వచ్చిన హుదూద్ తుపాన్‌కు తమ భూమిలో ఉన్న మామిడి చెట్లుకు నష్టం కలిగితే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా అందుకున్నామని వివరించారు. గిరిబాబు తమకు పట్టాలు రాకుండా చేశారని తెలిపారు. బినామీ పేర్లు రద్దుచేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

బిఆర్ఎజి సెట్ ప్రవేశాల రెండో దశ జాబితా

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 23న నిర్వహించిన బిఅర్ఎజి సెట్ ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఐఐటి, నీట్‌లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 21 న నిర్వహించే 2వ దశ పరీక్షకు ఎంపికైన వారి జాబితాను http://apg-pcet.apcfss.in వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. ఈ జాబితాలోని విద్యార్థులు మాత్రమే ఈ నెల 18వ తేదీ వరకు వెబ్ సైట్‌లో పొందుపరిచిన పేమెంట్ గేట్ వే ద్వారా రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 21న నిర్వహించే 2వ దశ పరీక్షకు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ఎంపికైన విద్యార్థులు మాత్రమే విశాఖ పరిధి శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 0891-2799641 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన క్లాప్ డ్రైవర్‌పై చర్యలకు

మెప్మా ఆర్‌పిల ఆందోళన

యూజర్ ఛార్జీల వసూలు బాధ్యత నుంచి తప్పించాలని నినాదాలు

జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్‌పిలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : యూజర్ చార్జీలు (చెత్త పన్ను) వసూలుచేసే క్రమంలో ఈ నెల 12వ తేదీన జివిఎంసి రెండో వార్డు మామిడిపాలెం ప్రాంతానికి చెందిన మెప్మా ఆర్‌పి ఆదిలక్ష్మి పట్ల అదే ప్రాంతానికి చెందిన క్లాప్ వాహనం డ్రైవర్ త్రినాథరావు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ సుమారు 30 మంది ఆర్‌పిలు సోమవారం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్‌పిలు మాట్లాడుతూ, యూజర్ ఛార్జీలు చెల్లించాలంటూ ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యురాలు ఇంటికి వెళ్లి అడగ్గా సభ్యురాలి భర్త క్లాప్ డ్రైవర్ అయిన త్రినాథరావు ఆర్‌పి ఆదిలక్ష్మి ఇంటికి వెళ్లి వాడరాని భాషలో అసభ్యంగా మాట్లాడారని వాపోయారు. ఇదే విషయాన్ని సిఒ నాగమణి, యుసిడి ఎపిడి ఎల్లపు సంతోషకుమార్‌కు సమస్య చెప్పగా సోమవారం జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత క్లాప్ వాహనం డ్రైవర్ క్షమాపణ చెప్పాలని, అతన్ని విధుల నుంచి తొలగించాలని, యూజర్ ఛార్జీల వసూలు భాధ్యతల నుంచి తమను తప్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను చెప్పుకునేందుకు స్పందనలో ఉన్న జెడ్సీ రాము వద్దకు వెళ్లగా, ఆయన ఇచ్చిన సమాధానం పట్ల తామంతా అసంతృప్తిగా ఉన్నట్లు ఆర్‌పిలు ఆవేదన వ్యక్తంచేశారు. ఇంతలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు బదులిస్తూ, క్లాప్ డ్రైవర్‌ను విధుల నుంచి తప్పిస్తే మిగిలిన క్లాప్ డ్రైవర్లు విధులకు గైర్హాజరవుతామంటున్నారని తెలిపారు. ఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన క్లాప్ డ్రైవర్‌పై చర్యకు అధికారులు వెనుకాడడం సబవు కాదని ఆర్‌పిలు అంటున్నారు. ధర్నాకు ముందు జోనల్ కమిషనర్‌కు ఆర్‌పిలు ఆదిలక్ష్మి, సన్యాసమ్మ, వెంకటలక్ష్మి, నారాయణమ్మ తదితరులు వినతి పత్రం అందజేశారు.

పాండ్రంగి లే-అవుట్ అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : జగనన్న ఇళ్లకు సంబంధించి పద్మనాభం మండలంలో వైసిపి నాయకులు చేస్తున్న అవకతవకలపై రోజురోజుకూ ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. మండలంలోని పాండ్రంగి పంచాయతీలోని జగనన్న లే-అవుట్ అక్రమాలపై సోమవారం స్పందన కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. పంచాయతీ పరిధి కురపల్లిలో 266, ఏనుగులపాలెం గ్రామంలో 40 ప్లాట్లు వేసి 2021 జనవరి 5న పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. ఈ పట్టాలు పక్కాగా ఇల్లు ఉన్న వారికే ఇచ్చారని ఆరోపించారు. ఒకే కుటుంబంలో రెండు, మూడు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, దీనిపై గ్రామ సభలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయిందని వివరించారు. అనర్హులని తొలగించి, 160 మంది అర్హులకు అందజేయాలని కోరారు. పెళ్లి కాని యువకులకు, ఒకే లే-అవుట్‌లో భార్యాభర్తలిద్దరి పేరుమీద వేర్వేరుగా పట్టాలు ఇచ్చారని తెలిపారు. 70 సంవత్సరాల వయసు వారికి ప్లాట్లు మంజూరుచేశారని, వారిలో కొందరు మృతిచెందారని వివరించారు. అయినా ఆ ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయని తెలిపారు. పట్టాలిచ్చిన నెంబరు గల ప్లాట్లులో కాకుండా నాయకులు చూపించిన ప్లాట్లులోనే నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. కొంత మందికి పట్టాలిచ్చినా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. పట్టాలు పొందిన కొందరు లబ్ధిదారులు స్థానిక నాయకుల సహకారంతో అమ్మకాలు చేశారని పేర్కొన్నారు. అర్హత కల్గిన వారు గత నాలుగేళ్లుగా వాలంటీర్లు ద్వారా దరఖాస్తు చేస్తున్నా ప్రయోజనం లేకపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందనకు ఫిర్యాదు చేసిన వారిలో కోసర అప్పలనాయుడు, కొత్తపల్లి సత్యనారాయణ, కోలగాని గిరి, గోర్లే సూరి, రీసు జట్లయ్య, సారిక పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామిని నెల్లిమర్ల ఎమ్మెల్యే బి.అప్పలనాయుడు సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాధరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -పిఎం పాలెం : పశ్చిమ గోదావరిలోని పాలకొల్లులో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే 6వ ఆంధ్రప్రదేశ్ యూత్ అంతర్ జిల్లా బాలబాలికల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే విశాఖపట్నం జిల్లా జట్లను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, కార్యదర్శి జి.భూషణరావు, సభ్యులు కెవి.బాలకృష్ణ, సిఐ వి.దొరబాబు ఆధ్వర్యాన సోమవారం చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రకటించారు.

బాలుర జట్టు : ఎం.హర్ష, కె.రిథిల్, కె.మహేష్, కె.తేజేష్, ఓ.నికిల్, వి.అభిరామ్, నకుల్ కుమార్, ఎం.ప్రశాంత్, ఆశిష్, ఎంవి.సామ్ సాథివిక్, సిద్ధార్థ, జి.సింహాద్రి ఎంపికయ్యారు. వీరికి కోచ్‌గా పి.జగదీష్ వ్యవహరించనున్నారు.

బాలికల జట్టు : ఎన్.కల్యాణి, కె.పావని, మాధురిప్రియ, ఆర్.భావన, బి.తేజాంబిక, పి.ప్రవల్లిక, వి.సునీత, ఎస్.చంద్రిక, దీక్షితనాయుడు, వై.రహిత, బి.యాషిక, కెవి.సమ్యమాన ఎంపికయ్యారు. వీరికి కోచ్‌గా ఆర్.సునీల్ రెడ్డి, మేనేజర్‌గా పూజలను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి అభినందనలు తెలిపారు.

స్పందనకు అర్జీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వేపగుంట : జోన్-8 పరిధిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు తెలిపారు. వీటిలో రెవెన్యూ, విద్యుత్, ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి నాలుగు వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు. వేపగుంట సర్వే నెంబర్ 164/1లో కోర్టు ఆదేశాలను ధిక్కరించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిపై స్పందించాలని డివి.మహేష్ వినతిపత్రం అందించారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు పలు సమస్యలపై ప్రజల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు 4 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి చెరో 2 అర్జీలు అందాయి.

వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

95వ వార్డులో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి సుజాత నగర్, మహంత్ స్కూలు డౌన్, పాపయ్యరాజు పాలెం తదితర ప్రాంతాలలో కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులో పందులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం సరిగా జరగడంలేదని, వార్డులో చాలా చోట్ల పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని శానిటరీ కార్యదర్శిని ఆదేశించారు. వార్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా భూగర్భ డ్రైనేజీ కోసం తీసిన గోతులను పనులు పూర్తయిన వెంటనే పూడ్చాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు చాలా చోట్ల ఉన్నాయని, వాటిని తొలగించాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడును ఆదేశించారు. అనంతరం విశాఖ బీచ్ రోడ్డులోని విశాలాక్షి నగర్ నుండి ఋషికొండ వరకు పారిశుధ్య పనులను పరిశీలించారు. చాలా చోట్ల వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని వాటిని వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్ కనక మహలక్ష్మిని ఆదేశించారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యకు ఆదేశించినట్లు సమాచారం.



నరసింహమూర్తిని సన్మానిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజు

పెందుర్తి పిఎసిఎస్ అధ్యక్షునిగా శరగడం ప్రమాణం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షునిగా వైసిపి నాయకుడు శరగడం నరసింహమూర్తి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సత్యవతమ్మ, ఎమ్మెల్యే అదీప్ రాజు ముఖ్యఅతిథులుగా హాజరై నరసింహమూర్తిని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెందుర్తి ప్రాంతం అభివృద్ధికి శరగడం నరసింహమూర్తి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రైతులకు మేలు కలిగే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రైతులకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయలపూడి భగవాన్ జయరాం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దేవిసొంబ, 95వ వార్డు కార్పొరేటర్ ఎం.దేవుడు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సిఐటియు నాయకులు కన్నారావు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : సిఐటియు సీనియర్ నాయకులు ఉప్పిలి కన్నరావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ యుఇఆర్ఎస్ విభాగంలో జనరల్ ఫోర్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. నిర్వాసిత ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సిపిఎం బలోపేతానికి కృషి చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగాల్లో నిర్వాసితులకు 50శాతం వాటా కోసం పోరాటం చేశారు. కాంట్రాక్టు లేబర్ యూనియన్, తోపుడు బళ్ళ కార్మికుల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఆయన మృతి పట్ల సిపిఎం, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్, సిఐటియు కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, స్టీల్ జోన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు.రామస్వామి, శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడుతూ, ఉప్పిలి కన్నారావు మృతి సిపిఎం, సిఐటియుకు తీరని లోటు అన్నారు. నిబద్ధతగా సిపిఎం అభివృద్ధి కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడారని గుర్తుచేశారు. సిపిఎం, సిఐటియు తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆశయాలను ముందుకు నడిపించాలని కోరారు. గంగాధర్, దత్తాత్రేయ, మరిడయ్య తదితరులు కన్నరావుకు నివాళి అర్పించారు.

సిపిఎం సంతాపం

కన్నారావు మృతిపట్ల సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రకటన విడుదలచేశారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి యంత్రాంగం

వేపగుంట : జీవీఎంసీ 97వ వార్డు పరిధి సత్యనారాయణపురం, సావిత్రినగర్‌లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, వార్డు వైసిపి అధ్యక్షులు ఎం.మహేష్ కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

50వార్డులో

మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మురళీనగర్ సచివాలయం, వాకర్స్ పార్కు ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా సంక్షేమ పథకాలు అమలు చేసి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేరుగా అందిస్తున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజల సమస్యలు ప్రజా ప్రతినిధులు నేరుగా తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రాయుడు శ్రీను, 50వార్డు నాయకులు పైడి కృష్ణారావు మాస్టర్, పప్పల సునీత, సనపల నారాయణస్వామి, ఎవిఎన్.రాజు, పాతపట్నం రామ్మోహన్, సబ్బవరపు శ్రీను, కాంచన రాజేశ్వరరావు, ఎం.లక్ష్మి, సోనీ, దాలినాయుడు, జగదీష్, శివాజీ, శ్రీనివాసరాజు, శివరాం కృష్ణ, నాయుడు, పి.ప్రకాష్, యువజన విభాగం ఇన్‌ఛార్జి ఎం.సునీల్, నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్న, రాఘవులు, నేపాల్ శ్రీను, అధికారులు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది అంగరకు ఏడాది జైలు

ప్రజాశక్తి-లీగల్ : చీటీల పేరుతో తోటి న్యాయవాదులను నమ్మించి రూ.లక్షల్లో సేకరించి తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన అభియోగంపై నేరంగా రుజువైనందున న్యాయవాది అంగర వెంకట లక్ష్మీపతిరావుకు ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహానగరం మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జెపద్మావతి సోమవారం తీర్పు వెల్లడించారు. శిక్షతో పాటు రూ.8 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఇతనికి సహకరించిన భార్య అంగర లక్ష్మికి రూ.8 వేలు జరిమానా విధించారు. ఆ సొమ్ము చెల్లించని పక్షంలో ఆమె కూడా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో బాధితుల తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలిపల్లి ఆదినారాయణ వాదనలు వినిపించారు. ఆయన కథనం ప్రకారం... మధురవాడ బక్కన్నపాలెంలో నివాసముంటున్న న్యాయవాది, విశాఖపట్నం న్యాయవాదుల సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి అంగర వెంకట లక్ష్మీపతిరావు, అతని భార్య అంగర లక్ష్మి 2019 సంవత్సరం నుంచి తోటి న్యాయవాదులతో చీటీలు కట్టించుకున్నారు. ప్రతి నెలా రూ.5000 చొప్పున చీటీ డబ్బులు కట్టించుకున్నారు. చీటీ కాలం పూర్తయిన పిదప వారికి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో భార్యాభర్తలపై నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో న్యాయవాది టి.బోసుబాబు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరాభియోగ పత్రాన్ని అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పాపారావు కోర్టులో దాఖలు చేశారు. న్యాయమూర్తి విచారించారు. నేరం రుజువైనందున నిందితులను పై విధంగా శిక్షిస్తూ తీర్పునిచ్చారు. పిదప అంగర వెంకట లక్ష్మీపతిరావును సెంట్రల్ జైలుకు తరలించారు. చీటీల పేరుతో రూ.లక్షలు పోగుచేసుకుని ఫ్లాట్, కారు కొనుక్కొని భార్యాభర్తలిద్దరూ సంతోషంగా తిరుగుతున్నారని బాధిత న్యాయవాదులు వాపోతున్నారు.

కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

గీతంలో కాటన్ జయంతి

ప్రజాశక్తి-మధురవాడ : ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 220వ జయంతిని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన సోమవారం ఆర్థర్ కాటన్ భవనంలో నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్.విజయశేఖర్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు బాలాజీ, నరేంద్ర, ఎమ్.రమేష్ తదితరులు కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని పచ్చగా ఉంచడానికి కాటన్ నిర్మించిన ఆనకట్టలు దోహదపడ్డాయన్నారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే యువత కాటన్ వంటి నిస్వార్థ నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాకు 2087 మంది గుర్తింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకార భరోసా పథకం కింద భీమిలి మండలం జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 2087 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మోటారు బోట్లు 279 , తెప్పలు 174 ఉన్నట్లు వివరించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ జోన్ -3 పరిధి మద్దిలపాలెం, కృష్ణా కాలేజీ రోడ్డు, హెచ్‌బి.కాలనీ రోడ్లలో 23, 16, 15 వార్డుల్లోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తొలగించినట్లు టిపిఎస్ తేజ తెలిపారు. జోన్ 3 పరిధిలో ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తున్నఅధికారులు

ఉపాధి పనుల కల్పనకు కృషి

ప్రజాశక్తి -హుకుంపేట: ఉపాధి పని కల్పించాలని మండలంలోని బూర్జ పంచాయతీ సులిపకోన్, సొంటర్ల పాడు, కొండయ్య పాడు మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం మూడు గ్రామ ప్రజలతో ఉపాధి హామీ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సంఘం నేతలను ఆహ్వానించారు.

'స్పందన, జగనన్నకు చెబుదాం'
ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి, తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలలో వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ప్రజల నుణ్ణచిఅర్జీలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారులు ఫిర్యాదులు, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో స్పందనకు వచ్చే సమయంలో పూర్తి వివరాలతో రావాలన్నారు. గృహ నిర్మాణం, నాడు నేడు, ఇంజనీరింగ్ పనులు, అంగన్వాడీ సెంటర్లు, హెల్త్ క్లినిక్‌లు, వ్యర్థాల నిర్వహణ మొదలైన వాటికి ప్రాధాన్యతనిచ్చి వెంటనే పనులు జరిగేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు .కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, డిఆర్‌ఒ పి.వెంకటరమణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజేష్ జన్మదిన వేడుకలు

తల్లికి కేకు తినిపిస్తున్న ఎంవిఆర్ తనయుడు రాజేష్

ప్రజాశక్తి- అనకాపల్లి : సంఘ సేవకులు, వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ప్రథమ కుమారుడు రాజేష్ జన్మదిన వేడుకలు అనకాపల్లి నరసింగరావుపేటలోని వారి స్వగహంలో సోమవారం ఘనంగా జరిగాయి. భారీ కేక్ కట్ చేసి తన తల్లికి, కుటుంబ సభ్యులకు తినిపించారు. వికలాంగులకు ఆర్థిక సహాయం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దీక్షిత్ పుట్టినరోజు వేడుకలు

ఆసుపత్రిలో అన్న సమారాధన నిర్వహిస్తున్న రాఘవ, తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి పట్టణ కార్యదర్శి, 84వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ కుమారుడు దీక్షిత్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఆస్పత్రిలో రెండు వందల మంది బాలింతలకు అన్నసమారాధన, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అన్నం ఆంజనేయులు, విల్లూరి మోది నాయుడు, సత్యనారాయణ, మొగలపల్లి రవితేజ, కోట్ని శ్రీనివాసరావు, పిన్నింటి కష్ణ, సూర్య, రమేష్ పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షునిగా మళ్లీ జోసెఫ్

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు పిఎస్ఎస్ఎన్ జోసెఫ్ జన్మదిన వేడుకలు డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా నాగు, కోశాధికారిగా ఎం మల్లేశ్వరరావు, సలహామండలి సభ్యులుగా కోలాటి చిదంబరం, విన్నకోట బుచ్చిరాజు, పేర్రాజు, ఆరుగురు సంఘ సభ్యులను ఎన్నుకున్నారు.

పారిశ్రామిక ప్రమాదాలపై నేడు రాష్ట్ర సదస్సు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : పారిశ్రామిక ప్రమాదాలపై విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16న జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సిఐటియు నేతలు కోరారు. సోమవారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని, 2020లో ఎల్జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటన, 2022లో అచ్యుతాపురం బ్రాండిక్స్ విషవాయువులు లీకేజీ, పరవాడ ఫార్మసిటీ, అచ్యుతాపురం ఫార్మసిటీల్లో నిత్యం అనేక ప్రమాదాల్లో అమాయక కార్మికుల ప్రాణాలు బలైపోతున్నాయిపారిశ్రామిక ప్రమాదాల్లో మాడి మసైపోతున్న కార్మికుల జీవితాలు దుర్భరంగా మారటానికి బాధ్యులు ఎవరనే విషయంపై చర్చించేందుకు రాష్ట్రంలో నలుమూలల్లో ఉన్న పారిశ్రామిక వాడల నుంచి కార్మికులు, కార్మిక నాయకులతో సదస్సులో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు,సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షులు ఆర్ రాము, జి దేవుడునాయుడు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే
ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తాం

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి : భవన కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ హెచ్చరించారు సోమవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయం నుంచి నాలుగరోడ్ల కూడలి మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన భవన నిర్మాణ కార్మికులు, అక్కడి బైఠాయించి ఆందోళన చేపట్టారు.
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 22లక్షల మంది సభ్యులుగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేసి, అన్ని రకాల సంక్షేమ పథకాలను, సౌకర్యాలను నిలిపేయడం దారుణమన్నారు. కరోనా తర్వాత ఇసుక కొరతతో ఉపాధికి దూరమైన భవన నిర్మాణ కార్మికులు బతుకుతెరువు కోసం అప్పులు చేసి నానా అవస్థలు పడినా, ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గడచిన మూడేళ్లలో 32వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నా

ఆర్‌డిఒ కార్యాలయం ముందు బైఠాయించిన కార్మికులు

పరిష్కరించలేదన్నారు. కార్మికుల నుంచి సభ్యత్వంగా, యజమాని నుంచి సెస్ రూపంలో సేకరించిన నిధులను కార్మిక సంక్షేమానికి వెచ్చించాలని డిమాండ్ చేశారు. 55ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలసరి రూ.ఐదు వేలు పెన్షన్, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతికార్మికుడికీ వాహనాల కోసం రూ.40వేలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు ఎం నారాయణ, నక్కరాజు కొండలరావు, కంచపాటి శ్రీనివాసరావు, భూపాలం మహాలక్ష్మి నాయుడు, వియ్యపు రాము, రాయి సింహాద్రి, కె.శ్రీనివాస్‌రావు, లెక్కల లక్ష్మి, చిరంజీవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్చుతాపురంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన కారుకుండి శ్రీను, కిల్లాడి శ్రీను కుటుంబీకులకు సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తిరాజు చెరొక రూ.6.50లక్షల ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. శుక్రవారం అచ్చుతాపురంలో గౌతమ్ ట్రావెల్స్ బస్సు ఢీకొని కిల్లాడి శ్రీను, కారుకుండి శ్రీను తీవ్ర గాయాలై మతి చెందిన విషయం తెలిసినదే.
మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళన చేయగా, గౌతమ్ ట్రావెల్స్ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మృతుల కుటుంబీకులకు సాయాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ , ఎంపిపి చేకూరి శ్రీనివాసరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, కె.విమల

కారు పార్కింగ్ స్థలం కనిపెట్టే యంత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-.అనకాపల్లి : అపార్ట్‌మెంట్స్, హోటల్స్ వంటి ప్రదేశాల్లో వాహనాలు నిలిపేందుకు స్థలం ఉందా లేదా కనుగొనే యంత్రాన్ని స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పి శ్రావణి, లక్ష్మి, జి శివకుమారి, ఎం లీలాశరణ్య, బి భవ్య శ్రీ రూపొందించినట్టు ప్రాజెక్టు ఇంజనీర్ బి. శేషగిరిరావు తెలిపారు.ఈ పరికరం తయారు చేయడానికి పార్కింగ్ సెన్సర్స్, ఎల్‌సిడి డిస్‌ప్లే, సర్వో మోటార్స్, 9ఓల్ట్స్ పవర్ సప్లై వాడినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు గైడ్ గా జి.శివకుమారి, పి. శ్రావణి లక్ష్మి వ్యవహరించారన్నారు. ఈ పరికరం తయారీకి కేవలం రూ.1500 ఖర్చు చేసినట్లు తెలిపారు హెచ్‌ఒడి డాక్టర్ పి.పూర్ణ ప్రియ ప్రోత్సాహం ఉందని

యంత్రాన్ని రూపొందించిన డైట్ విద్యార్థులు

విద్యార్థులు తెలిపారు. కాగా ఈ యంత్రాన్ని రూపొందించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు ప్రశంసించారు.

పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నేత రంగారావు

ప్రజాశక్తి -అనకాపల్లి : పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వహిస్తున్నాయని అనకాపల్లి జిల్లా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్ రంగారావు విమర్శించారు. సోమవారం స్థానిక సిఐటియు. కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఆల్ పెన్సనర్సు అండ్ రిటైర్డ్ పెన్సనర్సు అసోసియేషన్ సమావేశం ఆర్.రంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా సహాయ కార్యదర్శి కె.పి.కుమార్ మాట్లాడుతూ ఇపిఎస్ 95 పెన్షనర్ల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించి న్యాయం చేయాలని పార్లమెంట్ సమావేశాలకు ముందు అనకాపల్లి ఎంపి డాక్టర్ సత్యవతిని కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. దీంతో నేరుగా ప్రధానికే తమ సమస్యలను పోస్టుకార్డు ద్వారా తెలియజేయాలని నిర్ణయించామన్నారు. పోస్టుకార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశం లో సిఐటియు నాయకులు కె.తేలయ్యబాబు, జె.అప్పారావు పాల్గొన్నారు.

వివి రమణకు ఘననివాళి

వివి రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శ్రీగౌరీ గ్రంథాలయము ఆధ్వర్యంలో సోమవారం మాజీ పార్లమెంట్ సభ్యులు వి.వి.రమణ శతజయంతి ఘనంగా నిర్వహిచారు. వివి రమణ చిత్రపటానికి గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కంప్యూటర్ అండ్ డ్రాయింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు.కార్యక్రమములో కోశాధికారి భీశెట్టి కష్ణప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కార్యవర్గసభ్యులు కర్రి హనుమంతరావు, కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, బుద్ద జోగినాయుడు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రం

మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐటియు నేత సోమునాయుడు

ప్రజాశక్తి -అచ్యుతాపురం: మండల కేంద్రమైన అచ్యుతాపురంలో సోమవారం యువశక్తి ఆటో స్టాండ్ కార్మికులు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీని సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు ప్రారంభించారు తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమైన కూడళ్లలో ప్రభుత్వపరంగా చలివేంద్రాలను ప్రారంభించి, ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో యువశక్తి ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సెక్రటరీ డి చండీ, పి అప్పారావు, కోశాధికారి డి సన్నిబాబు, టి రాజు, వి శ్యాము, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల వార్షికోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామిని వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. అన్న సమారాధనను ప్రారంభించారు.

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి -మునగపాక రూరల్: ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించేలా సిఎం జగన్ రూపొందించిన వాలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, ప్రధానమంత్రి మోడీ కూడా ఈ వ్యవస్థను అభినందించి దేశవ్యాప్తంగా అమలు చేసే యోచనలో ఉన్నారని ఎలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్ర ముందువరుసలో ఉండడానికి వాలంటీర్ల వ్యవస్థే కారణమన్నారు. వెంకటాపురం సచివాలయం అన్ని విధాలా ఆదర్శంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుందరపు తాతాజీని ఆయన అభినందించారు. అనంతరం తన సొంత నిధులతో వాలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చంనాయుడు, సచివాలయాల కన్వీనర్ పొలిమేర గణేష్, సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, మాజీ సర్పంచ్ సుందరపు కనక అప్పారావు, ఉప సర్పంచ్ బొమ్మిరెడ్డిపల్లి సాయి వజ్రం, ఎంపిటిసి మద్దాల వీర్ నాయుడు, ఎంపిడిఒ రవికుమార్, సచివాలయ కార్యదర్శి మోహిని పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని పి బోనంగి పంచాయతీ శివారు వివిఎల్ఎం.పురంలో బోయిమాంబ ఆలయ పునర్నిర్మాణ పనులకు సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ దంపతులు శంకుస్థాపన చేశారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా ఉండడంతో వేద పండితులు శ్రీరామా చార్యులు సూచనల మేరకు గ్రామస్తులంతా ఏకాభిప్రాయంతో పునర్నిర్మాణానికి సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి మొదటి నుంచి ముందుండి నడిపిస్తున్న బండారు చిన్నారావు, కాంట్రాక్టర్ బండారు బోయిన్నలకు సర్పంచ్ కల్పన రాజశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపిటిసి డెక్క శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయవరపు దేవుడు దంపతులు, బండారు అప్పారావు (స్టీల్‌ప్లాంట్) దంపతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అగ్నిప్రమాదం : భారీ ఆస్తి నష్టం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్కవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వ్యాచలపు సూర్యనారాయణ చెందిన రూ.5వేల విలువైన ధాన్యం బూడిదకాగా, ఒక గేదె సజీవదహనమైంది. మాజీ ఎంపిటిసి మిడతాడ వెంకటరమణ, వ్యాచలపు కాసులు చెందిన రూ.2 లక్షల విలువైన పశువుల పాకలు కాలిపోయాయి. సంఘటన స్థలానికి చోడవరం అగ్నిమాపక కేంద్ర సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. అర్ధరాత్రి ప్రమాదం సంభవించడంతో ఆస్తినష్టం ఎక్కువ జరిగిందని రైతులు వాపోతున్నారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, గూనూరు వెంకటరమణ పెద్దబాబు బాధిత రైతులను పరామర్శించారు. లక్కవరం మాజీ సర్పంచ్ కర్రి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లు నాయుడుపాలెం పంచాయతీలో మావుళ్ల చెరువులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ బోను దేవుడమ్మ గంగునాయుడు ఎంపిటిసి గొర్లి కనకరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఒ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ 75 ఎకరాల ఆయకట్టు ఉన్న మావుళ్ళ చెరువుకు రూ.9.90లక్షల ఉపాధి నిధులు మంజూరయ్యాయని, 3631 పని దినాల పనులు చేయాల్సి ఉందన్నారు. 196 మంది కూలీలు చెరువు పనులు చేస్తున్నారని, దినసరి సగటు వేతనం రూ.265 గిట్టుబాటు అయ్యేలా వచ్చే నెలాఖరుకు పనులు పూర్తవుతాయన్నారు కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, వార్డు సభ్యులు ఎన్నేటి రమణ, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పేరుకే పెద్దాసుపత్రి...

- అర్బన్ సెంటర్‌లో ఉన్న సౌకర్యాలైనా లేని ఎన్‌టిఆర్ ఆసుపత్రి
- కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు రిఫరల్‌తో గర్భిణుల ఇక్కట్లు

ఎన్‌టిఆర్ జిల్లా కేంద్ర ఆసుపత్రి...

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉందని, అటు పిహెచ్‌సికి ఎక్కువ, పెద్దాసుపత్రికి తక్కువగా మారిందని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు విమర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస పరీక్షలు నిర్వహించలేని పరిస్థితుల్లో జిల్లా ఆసుపత్రి ఉందంటే ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారో అర్థమవుతుం దన్నారు. సబ్బవరం మండలం నారపాడు గ్రామానికి చెందిన గర్భిణి చందక కృష్ణకుమారి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి వైద్యపరీక్షలకు రాగా, కోవిడ్ పరీక్షల రిపోర్టు వుంటేనే ఆసుపత్రిలో జాయిన్ చేసుకుంటామని వైద్య సిబ్బంది తెల్పిచెప్పడంతో వారు అయోమయానికి గురయ్యారన్నారు. పోనీ ఇంత పెద్దఆసుపత్రిలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయాలి కదా అంటే, వారం రోజులుగా కోవిడ్ పరీక్షల కిట్లు లేకపోవడంతో వచ్చిన ప్రతిరోగినీ బయటకు పరీక్షల కోసం పంపించేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఎండల సమయంలో గర్భిణులను కోవిడ్ పరీక్షల కోసం బయటకు ల్యాబ్‌లు, ఆసుపత్రులకు పంపడడం, అక్కడ పరీక్షలకు రూ.800 వరకు ఖర్చు పెట్టే పరిస్థితి ఉంటే, ఇక ఇలాంటి ప్రభుత్వాసుపత్రి ఉండడం వల్ల రోగులకు ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో కొట్ని వీధిలోని యుపిహెచ్‌ఎస్‌కు వెళ్లి కోవిడ్ పరీక్ష చేయించుకుని వచ్చారు. ఇలా ఒక యుపిహెచ్‌సిలో ఉన్న సౌకర్యాలు కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో లేకపోవడ విడ్డూరమన్నారు.

నిరుద్యోగులకు స్వయంఉపాధి రుణాలు

శిక్షణలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ఎడి జోగినాథ్

ప్రజాశక్తి - కశింకోట : ప్రధానమంత్రి స్వయం ఉపాధి కల్పన పథకంలో నిరుద్యోగుల స్వయం ఉపాధికి బ్యాంకు రుణాలను అందజేస్తారని, అర్హులు, ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జోగినాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ సంఘాల సహాయకులు (విఒఎ)ల శిక్షణలో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలోని 18ఏళ్ల నిండిన నిరుద్యోగ యువతకు స్వయంఉపాధికి బ్యాంకు రుణాలిస్తాయని, ఆసక్తి ఉన్నవారు వెలుగు విఒఎలకు లేదా వెలుగు కార్యాలయంలో ఆధార్, బ్యాంక్‌బుక్,కుల, జనన సర్టిఫికెట్, ఇతర అర్హతల ధ్రువీకరణలతో దరఖాస్తులు అందజేయాలని, పరిశీలించి, అర్హులైన వారికి నెలరోజుల్లోనే రూ.లక్ష నుంచి రూ.20లక్షల వరకు రుణాలను అందజేస్తారన్నారు. .కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వి ధర్మారావు, ఎపిఎం శ్రీనివాసరావు, ఎంఎంఎస్ అధ్యక్షులు కె.అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, సిసిలు, విఒలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానానికి ప్రాధాన్యత

విత్తనాల కిట్లు పంపిణీ చేస్తున్న లచ్చన్న

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎపి సిఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్ లచ్చన్న అన్నారు. సోమవారం మండలంలోని సీతానగరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయవిభాగం, అనకాపల్లి డివిజన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణనిచ్చారు. పిఎండిఎస్ నవ ధాన్యాల సాగుకు సంబంధించి 30 రకాల విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ, ఈ నవధాన్యాలు విత్తనాలు ఒక ఎకరానికి 12 కేజీలు వేసుకోవాలని సూచించారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 24 పంచాయతీలకు 6 ,400 కిట్లును డిపిఎం అందజేశారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేని సాగుతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు ఘన, ద్రవ జీవమృతం, కషాయాలు సామూహిక తయారీ విధానం వంటి సప్త సూత్రాలపై వివరించారు. దీని ద్వారా పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రతి ఇంటి వద్ద కిచెన్ గార్డెన్ వేసుకుని, కాయగూరలును పండించుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి సీతానగరం గ్రామ సర్పంచ్ సుంకర చంటి, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, సుందరయ్యపేట సర్పంచ్ డి.ధనలక్ష్మి తాతారావు, ఎంపిటిసిలు ఎ.రాము, రాపేటి వెంకటేశ్వరరావు, గోవిందు, వర్మ, అప్పలరాజు, ఎ. చిన్నబ్బాయి పాల్గొన్నారు.

జగనన్న దీవెనలు ఎప్పుడో..?

ప్రజాశక్తి -అనకాపల్లి : జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతనెల 26న బటన్ నొక్కినా అనేకమంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమకాలేదనిఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ద రాజేష్ ఆరోపించారు. దీనిపై సచివాలయానికి వెళ్లి సిబ్బందిని గాని, కాలేజీ యాజమాన్యాన్ని గానీ అడిగితే తమకు సమాచారం లేదని చెప్తున్నారన్నారు. జగనన్న దీవెనల నగదు జమలో ఎక్కడ జాప్యమౌతుందో? లేకుంటే అసలు నగదు ప్రభుత్వం నుంచి వేయలేదో సంబంధిత విద్యాశాఖ అధికారులు పరిశీలన జరిపి, విద్యార్థుల్లో నెలకొన్న గందరగోళానికి తెరదించాలని కోరుతున్నారు. ఈ నెల 29 నుంచి ఇంజినీరింగ్ పరీక్షలు ప్రారంభమౌతున్న నేపథ్యంలో కాలేజీ ఫీజులు చెల్లించకుంటే పరీక్షలు రాయించేది లేదని కాలేజీ యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ముఖ్యమంత్రి దృష్టి సారించి, తక్షణమే సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంగన్వాడీ పనితీరుపై అసంతృప్తి

అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి -అనకాపల్లి : అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపరచాలని ఎంపిపి గొర్లి సూరిబాబు సూచించారు. సోమవారం బవులవాడ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ చార్ట్ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రం పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ, పదేపదే హెచ్చరిస్తున్నా పనితీరు మెరుగుపడకపోవడం సరికాదని హెచ్చరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నెలలో రెండుసార్లు అంగన్వాడీలను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె ధర్మారావు, ఎపిడిపిఒ శశికళ, వైసిపి నేతలు మజ్జి వెంకట అప్పారావు, దాడి కుమార్, ఉడత వెంకట రమణ, ఎంపిటిసి తోటాడ విజయ్, అధికారి వెంకటరావు, శ్రీను, కన్నారావు పాల్గొన్నారు.

విస్తారంగా కురిసిన పొగమంచు

నర్సీపట్నంలో రోడ్డులో దట్టంగా పొగమంచు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం, నర్సీపట్నం రోడ్డులో సోమవారం తెల్లవారుజామున విస్తారంగా మంచు కురిసింది. ఉదయం పూట దట్టంగా మంచు, ఆ తర్వాత కొద్దిసేపటికే నిప్పులు చెరిగేలా మండుటెండలు, ఇలా భిన్నమైన వాతావరణ మార్పులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఉపాధి నిర్వీర్యానికి ప్రభుత్వాల కుట్ర

వడ్డాదిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సాంబశివరావు

ప్రజాశక్తి -వడ్డాది : ఉపాధి పథకం నిర్వీర్యానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయనివ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పినపాత్రని సాంబశివరావు విమర్శించారు. సోమవారం వడ్డాది పాండవుల చెరువులో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టంలోని సౌకర్యాలకు కేంద్ర ప్రభుత్వం ఎసరు పెట్టడం దుర్మార్గమన్నారు. ఉపాధి కూలీలు దృఢ నిశ్చయంతో పని చేసి హక్కులను కాపాడుకోవాలన్నారు.

కె.కోటపాడు : ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని ఎపి రైతు సంఘం మండల కోశాధికారి వనము సూర్యనారాయణ అన్నారు. సోమారం మండలంలోని ఎ. కోడూరు గ్రామంలో రంగరాజు చెరువు వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు కేంద్ర ప్రభుత్వము దశలవారీగా ఉపాధి చట్టాన్ని కుదించుటకు కంకణం కట్టుకుందన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, పలుగు పార, తట్టలతోపాటు వేసవి అలవెన్స్, ఇతర సౌకర్యాలను చట్టపరంగా కల్పించాలని డిమాండ్ చేశారు.

కె.కోటపాడులో ఉపాధి కూలీలతో వనం సూర్యనారాయణ

మైదానంలో దట్టంగా పొగ మంచు

బుచ్చయ్యపేట, కోటవురట్లలో కురుస్తున్న పొగ మంచు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని సోమవారం ఉదయం దట్టమైన పొగ మంచు కురిసింది. ఉదయం 7 గంటల వరకు మంచు కురవడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పొగ మంచు కురవడంతో రోడ్లు కనిపించలేదు. దీంతో లారీలు, ఇతర వాహనాలు, ద్విచక్ర వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు .

బుచ్చయ్యపేట:మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, చిన్నప్పన్నపాలెం, కందిపూడి రాజంలో పొగ మంచు దట్టంగా కురిసింది. తెల్లవారుజామునుండే ప్రారంభమైన పొగ మంచు ఉదయం 8 గంటల వరకు కురిసింది. అనంతరం ఎండ ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటల వరకు విపరీతమైన ఉక్క పోతతో ఎండ కాయడంతో ప్రజలు విలవిల లాడిపోయారు. ఇళ్ల నుంచి బయటికి రావడానికి సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండతోపాటు విపరీతంగా ఒక్క పోత ఉండటంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడ్డారు.

కోటవురట్ల:మండలంలో మండు వేసవిలో కూడా దట్టమైన మంచు కురిసింది. శీతాకాలాన్ని తలపించడంతో వాతావరణం చల్లబడుతుందని అంతా భావించారు. ఉదయం 8 గంటల నుండి భానుడు తన విశ్వరూపాన్ని చూపాడు. ఉదయం 10:30 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వృద్ధులు, చిన్నారులు, చిరు వ్యాపారులు, రైతులు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మాడుగులలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:ప్రముఖ వ్యాపార వేత్త అనకాపల్లికి ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్)పెద్ద కుమారుడు ముత్యాల రాజేష్ జన్మదినం సందర్భంగా సోమవారం మాడుగులలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల బస్ స్టాండ్ వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మాడుగుల మోదకొండమ్మ, ఇతర ఆలయాలలో రాజేష్ పేరిట పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు అప్పలనాయుడు, ప్రణతి పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలోని చాకలి పేటలో ఆలయంలో వెంకటేశ్వరరావు కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచి బారులు తీరారు. కల్యాణాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న గొలుగొండ రోడ్డు

బాబోయ్ ఎండలు

ప్రజాశక్తి-గొలుగొండ:భానుడి ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. ప్రజలు రోడ్డుపైకి రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు ప్రతాపం అధికంగా ఉండి సాయంత్రం నాలుగు గంటలైనా ఎండ తీవ్రత ఎక్కడా తగ్గడం లేదు. వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి భయపడుతున్నారు. గొలుగొండ, చీడిగుమ్మల, ఏ.ఎల్ పురం, ఏటిగైరంపేట ప్రధాన కేంద్రాలు నిర్మానుష్యంగా మారాయి.

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి -గొలుగొండ: కామ్రేడ్ సుబ్బారావు నిత్యం గిరిజన ప్రజల కొరకు పోరాటాలు చేశారని సిపిఐ అనకాపల్లి జిల్లా సంయుక్త కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు కొనియాడారు. ఏఎల్ పురంలో ఆయన సమాధుల వద్ద సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, నిత్యం పోరాటాలు చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సుబ్బారావు కృషి చేశారన్నారు. నక్సలైట్లు ఉనికిని ఎక్కడ కోల్పోతామని మేక సూరిబాబు, సుబ్బారావు లను హతమార్చడంతో పార్టీ తీవ్రంగా నష్టపోయిందన్నారు.ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల కార్యదర్శి మేక భాస్కరరావు, కొయ్యూరు మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు, సుబ్బారావు కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జి.దేముడు సతీమణి చెల్లయమ్మ పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

రహదారి భద్రతపై అవగాహన

ప్రతిజ్ఞ చేస్తున్న సమాఖ్య సభ్యులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలో సోమవారం మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు వి.శాంత కుమారి ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా సమాఖ్య సభ్యులంతా ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటిస్తామంటూ ప్రమాణం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామం చివరి వరకు ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్లు తప్పక ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం మంగ, స్త్రీ నిధి మేనేజర్ కనకమహాలక్ష్మి, సీసీలు అప్పలనాయుడు, గోవిందు, వివోఏలు రామారావు, వరహాలబాబు, జమీలుతో పాటుగా పలువురు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: రోడ్డు సమస్యకు సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు ప్రారంభం జరుగుతున్నాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆరిలోవ అటవీప్రాంతంలో సోమవారం సాయంత్రం రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనులను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నర్సీపట్నం – కృష్ణదేవిపేట మార్గంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఉన్న 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరగక పోవడంతో వాహనదార్లు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీనిపై ఎంతో మంది నాయకులు హామీలు ఇవ్వడం మినహా ఏనాడు పనులకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. రెండున్నర ఏళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణ చేసి గొలుగొండ మండలంలో ఉన్న 50వేల మంది ప్రజలతో పాటు ఇతర జిల్లాల ప్రజలకు ఈ రోడ్డు విస్తరణ చేసి ప్రజల కష్టాలు తీర్చాలని చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పలుసార్లు సిఎం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు వారం రోజుల్లో ప్రారంభం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డిఎఫ్ఓ రాజారావు, ఈఈ బాలసుందరబాబు, డీఈఈ కె.సిద్ధార్థప్రభు, సిఐ రమణయ్య, తహసీల్దార్ ఆనందరావు, నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, మండల వైసీపీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ, పిఎసిఎస్ మాజీ అధక్షులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

పథకాలను వివరిస్తున్న ధర్మశ్రీ

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు - ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం:సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో మరుపాక గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ధర్మ శ్రీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలోనూ కూడా అమలు కాని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నామన్నారు. ఎటువంటి అవినీతికి, లంచాలకు తావు లేకుండా పని చేయడం జరుగుతుందన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా రాష్ట్ర ప్రజలందరినీ సమాన దృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కామహాలక్ష్మి నాయుడు, మండల కన్వీనర్ జగన్నాధరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మరుపాక సర్పంచ్ పందూరు సత్తిబాబు, మాజీ సర్పంచ్ రావి గోవిందు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పంచాయతీలలో ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త రాజాన వీర సూరిచంద్ర విమర్శించారు సోమవారం ఆయన మండలంలోని గురందరపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురందొరపాలెం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు సానాపతి నాయుడు ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, మంచినీటికి గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శ్మశానానికి రహదారి సౌకర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గడ్డం దొరబాబు, సీనియర్ నాయకులు రేగబల్ల శివ, 13వ వార్డు ఇంచార్జ్ గూడెపు తాతబాబు, వాస వెంకటేశు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

హాజరైన రెవెన్యూ సిబ్బంది, రైతులు

'భూహక్కు - భూరక్ష'పై గ్రామసభ

ప్రజాశక్తి -రావికమతం: జగనన్న భూహక్కు భూరక్ష పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచు దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలో కవగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామ కమ్యూనిటీ హాలు వద్ద సోమవారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, జగనన్న భూహక్కు భూరక్ష సర్వే బుడ్డిబంద రెవెన్యూలో పూర్తి అయ్యిందని తెలిపారు. రెవెన్యూ పరిధిలోని రైతుల పేర్లు, భూమి తాలూకా విస్తీర్ణాలను గ్రామ సభలో చదివి వినిపించారు. గతంలో రైతులకు ఆన్లైన్ లేకుండా నేషనల్ ఖాతాలో ఉండటం, అలాగే సాగులో ఉంటూ భూమి తాలూకా హక్కు పొందలేకపోవడం , భూమి యొక్క సర్వే నెంబర్లు తప్పు తడకలుగా ఉండడం ,ఇటువంటివన్నీ ఈ సర్వే ప్రక్రియ ద్వారా సరిచేసి రైతులందరికీ ఆన్లైన్, పాస్ పుస్తకాలను అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, వీఆర్ఓ సత్తిబాబు, ఉప సర్పంచ్ కే .భవాని, గృహ సారథి రొబ్బ వీరభద్రరాజు పాల్గొన్నారు.

గొర్రెలు, కోళ్లపై కుక్కల దాడి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఎ.ఎల్. పురం గ్రామంలో ప్రజలు, పశువులపై వీధికుక్కల దాడులు రోజురోజుకు విపరీతంగా పెరిగి పోతున్నాయి. ఒంటరిగా వెళ్లే పాదచారులను వెంటాడి కరచి గాయాలపాలు చేస్తున్నాయి. ఈ రెండు రోజుల్లో సుమారు 35 మందిపై కుక్కలు దాడికి పాల్పడ్డాయంటే వాటి స్వైర్యవిహారం ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. సోమవారం ఉదయం అల్లూరి పార్కు సమీపంలో గొంప చిట్టిబాబు వ్యవసాయ క్షేత్రంలోకి నాలుగు కుక్కలు ప్రవేశించి రెండు గొర్రెలు, నాలుగు నాటుకోళ్లపై దాడి చేసి వాటిని మట్టుబెట్టాయి. రూ.20 వేలు నష్టం వాటిల్లిందంటూ ఆ రైతు లబోదిబో మంటున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేకశ్రద్ధ కనబరచి వీధికుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మృతి చెందిన గొర్రె

ఎస్ఎస్‌సి పరీక్షల్లో సత్తా

ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా వెంకటేశ్వరరావుకు ఉద్యోగం

ప్రజాశక్తి గొలుగొండ: గొలుగొండ మండలం ఏ ఎల్ పురం పోస్ట్ ఆఫీస్‌లో ఏడాదిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటేశ్వరరావు ఎస్.ఎస్.సి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఇన్కమ్ ట్యాక్స్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం సాధించాడు. మండలంలోని పాకలపాడు ఆయన స్వస్థలం. వెంకటేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయాధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, వార్డు కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ లో శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.దమయంతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగాయి. పివి కనకరాజు మాస్టారు ఇంగ్లీష్ రైమ్స్, స్టోరీస్ చదివించారు. విశ్రాంత గ్రంథాలయధికారి కె. త్రిమూర్తులు పంటల మెలకువలు వివరించారు.

గొలుగొండ: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ , జనరల్ నాలెడ్జి పై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం కుమారి విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

మునగపాక రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్వి. రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతికథలు, జనరల్ నాలెడ్జ్ ఇతర అంశాలపై ఉపాధ్యాయులు పిల్లా జగదీష్ అవగాహన కల్పించారు. పోటీపరీక్షల్లో విజయం సాధించాలంటే జికె పరిజ్ఞానం అవసరమన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు లేమన్ అండ్ స్పూన్ ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.శిరీష తెలిపారు.

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. కాగితంతో, పనికిరాని అట్టలతో రకరకాల ఇళ్ల నమూనాలను, పువ్వులను, బొకేలను తయారు చేశారు.కళాకృతుల వర్క్ షాపు మరొక రెండు రోజులు కొనసాగనున్నది. వీటికి రిసోర్స్ పర్సన్‌గా జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి వ్యవహరించారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి , గ్రంథాలయాధికారి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు పుస్తక, నాటక రచనలపై రమణ అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి నరసింహం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో భానుమూర్తి, మహేష్ పాల్గొన్నారు.

లోకేష్‌కు మద్దతుగా పాదయాత్రలు



నర్సీపట్నంలో హాజరైన అయ్యన్న, నాయకులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:లోకేష్ చేపట్టిన పాదయాత్రకి సంఘీభావంగా నర్సీపట్నంలో తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాదయాత్రను చేపట్టారు. స్థానిక పెద్ద చెరువు వద్ద మరిడి మహాలక్ష్మి అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించారు. బైక్ ర్యాలీ చేపట్టారు.అబీద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, రాజ్యాంగానికి జగన్ రెడ్డి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని విమర్శించారు.వైసీపీ రాక్షస పాలనలో రాష్ట్ర భవిష్యత్ అంధకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత బుద్ద నాగ జగదీశ్వరరావు, జడ్పీటిసి సుకల రవణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల: టిడిపి నేత నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర వంద రోజులకు చేరుకోవడంతో మాడుగులలో సోమవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఘాట్ రోడ్ జంక్షన్ వద్ద నుండి మాడుగుల వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్ర విజయవంతంగా నడుస్తుందని, ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందన్నారు. టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోటవురట్ల: యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం టిడిపి మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాదయాత్ర చేపట్టారు. రామచంద్రపాలెం గ్రామం నుండి బికె పల్లి, జల్లూరు మీదుగా ఎండపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు.పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జానకి శ్రీను, జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, వెచలపు జనార్ధన్, పీకే పల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, పలువురు ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.

అనకాపల్లి : రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని, యువగళం పాదయాత్రతో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని నెహ్రూచౌక్ జంక్షన్ నుంచి సుంకరమెట్ట వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ముందుగా మున్సిపల్ స్టేడియంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నేతలు ఎం నీలబాబు, మల్ల సురేంద్ర, బిఎస్ఎస్ఆర్. జోగినాయుడు, కాయల మురళీ, కొణతాల శ్రీనివాసరావు, పోలవరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, బొద్దపు ప్రసాద్, ఉగ్గిన రమణమూర్తి, రత్నకుమారి, ఎంఎస్ఎన్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల కేంద్రంలో సోమవారం టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రారంభించారు. అచ్యుతాపురం నుంచి చోడపల్లి ,కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట, మునగపాక వరకు పాదయాత్ర సాగింది. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, అచ్యుతాపురం మండల టిడిపి అధ్యక్షులు జనపరెడ్డి నరసింహారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : లోకేష్ చేపట్టిన పాదయాత్ర సోమవారం నాటికి 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన తగరపువలస నుంచి భీమిలి పార్టీ కార్యాలయం వరకు 5 కిలోమీటర్ల మేర సోమవారం సాయంత్రం పాద యాత్ర చేపట్టారు. ముందుగా తగరపువలస జంక్షన్ వద్ద డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్‌తో కలిసి కోరాడ రాజబాబు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా వై జంక్షన్‌కు చేరుకుని అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ నుంచి పాదయాత్ర భీమిలి బ్యాంక్ కాలనీ, చిన బజారు మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు, డిఎవిఎ.రాజు, పతివాడ రాంబాబు, టి.సూరిబాబు, బడిగింటి నీలకంఠం, కోరాడ రమణ, పిట్టా సురేష్, వానపల్లి సత్య, తెలుగు మహిళలు, తెలుగు యువత పాల్గొన్నారు.

ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన యువగళానికి సంఘీభావ యాత్రను సోమవారం నిర్వహించారు. 10వ వార్డు రవీంద్రనగర్, వివేకానందనగర్ వినాయక ఆలయం నుంచి ప్రారంభించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సంఘీభావ యాత్రను ప్రారంభించారు. ముందుగా ఆయన రవీంద్రనగర్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రవీంద్రనగర్ నుంచి తోటగరువు, బాలాజీనగర్, ఆరిలోవ, టిఐసి పాయింట్ మీదుగా ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వరకు సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడారు. టిడిపి నాయకులు పట్టాభి, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, పోతన్న రెడ్డి, ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, గాడు అప్పలనాయుడు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, యేడువాక సన్యాసిరావు, తురకపూడి బాలస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తగరపువలసలో చేపడుతున్న పాదయాత్ర

అనకాపల్లిలో...

ఆగిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం నుండి మారేడు మిల్లు వెళ్లే ఆర్టీసీ బస్‌లు తరుచూ మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నర్సీపట్నంలో బయలు దేరిన బస్ చిన్నయ్యపాలెం వద్ద ఆగిపోయింది. ఈ బస్ ప్రతి రోజు నర్సీపట్నం నుండి బయలుదేరి మన్యంప్రాంతమైన మారేడుమిల్లికి వెళుతుంది. ఒకటే బస్ కావడంతో రద్దీగా ఉంటుంది. బస్ నిలిచిపోవడంతో రెండు గంటల పాటు చిన్నయ్య పాలెంలో ప్రయాణికులు పడిగాపులు కాశారు. నర్సీపట్నం నుండి మరో బస్ వచ్చే వరకు ఇబ్బందులు పడ్డారు.

నిలిచిపోయిన బస్

వైభవంగా మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల రెండో రోజైన సోమవారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో సందడి నెలకొంది. శతకంపట్టు వద్ద కొలువైన ఉత్సవ విగ్రహం, పాదాలను, అమ్మవారి ఆలయంలోని మోదకొండమ్మను మన్యం నలుమూలల నుంచే కాకుండా మైదాన ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పట్టణంలో ఎటు చూసినా సందడి వాతావరం నెలకొంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జైంట్ వీల్, డ్రాగన్ ట్రెన్, గాల్లో తేలియాడే పడవ, చిన్నపిల్లల ఆటల పరికరాలు ఏర్పాటు చేయడంతో చిన్న, పెద్దలతో సందడి నెలకొంది. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పి అతుల్ సిన్హా, ఎఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పర్యవేక్షణలో స్థానిక సిఐ బి.సుధాకర్, ఎస్ఐలు లక్ష్మణరావు, రంజిత్, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలువురు సిఐలు, ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ అందర్నీ ఆకట్టుకుంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే వారంతా విద్యుత్తు లైటింగ్ లను ఎంతో ఆసక్తిగా తిలకించారు. అమ్మవారి ఆలయం మొదలుకుని ప్రధాన మార్గాలు, కూడళ్లలో ఏర్పాటు చేసిన లైటింగ్ కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయి. పట్టణంలోని ఆయా కూడళ్లలో ఏర్పాటుచేసిన దేవత రూపాల లైటింగ్ సెట్ లు ఆకర్షణీయంగా ఉన్నాయి.

అనుపోత్సవం నేడు..

మోదకొండమ్మ మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన మంగళవారం అనుపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజు శతకంపట్టులో కొలువుతీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంటుంది. తొలి రోజు ఆలయం నుంచి ఊరేగింపుగా శతకం పట్టు వద్దకు తీసుకుని వచ్చి కొలువు తీర్చిన అమ్మవారి ఉత్సవ విగ్రహం పాదాలను తిరిగి ఆలయంలో కొలువు తీర్చే అనుపోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

మోదకొండమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఐటిడిఎ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రదర్శించిన స్టాల్స్ కు మంచి స్పందన లభిస్తోంది. మన్యంలోని ఐటిడిఎ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి. ప్రజలకు రాయితీపై అందిస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రచార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ ప్రహరీని ఆనుకుని ప్రధాన రహదారి వద్ద ఏర్పాటుచేసిన ఈ స్టాల్స్‌ను పండగకు విచ్చేసిన భక్తులు సందర్శిస్తున్నారు. ఐటిడిఎ చేపట్టిన అభివృద్ధిపై సమాచార శాఖ ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శన, జిసిసి, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, ఐసిడిఎస్, వెలుగు, తదితర శాఖలు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్ల చూపులను ఆకట్టుకున్నాయి. ప్రతి విభాగం నుంచి ఇన్ ఛార్జిగా ఉన్న ఉద్యోగి వీక్షకులకు పథకం గొప్పతనాన్ని, పథకం ద్వారా జరిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలను కళ్లకు కట్టినట్లు ప్రచార స్టాల్స్ ద్వారా వివరిస్తున్నారు.

బారులు తీరిన భక్తులు